అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి



దేవర వంశీ

గోల్కొండ: తెలంగాణ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలందరికీ రేషన్ కార్డులు జారీ చేయాలని బీజేపీ నాయకుడు దేవర వంశీ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అమలు కానీ హామీలు ఇస్తూ అధికారంలోకి వచ్చారని ప్రస్తుతం తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇస్తామంటూ ప్రజలను మభ్యపెట్టడం కాంగ్రెస్ నైజం అని ఆయన ధ్వజమెత్తారు. దరఖాస్తు చేసుకున్న నిరుపేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే కాంగ్రెస్, దాని మిత్రపక్షమైన మజ్లిస్ ప్రాంతాలలోనే సర్వే జరుగుతుందన్నారు. వెంటనే దరఖాస్తు చేసుకున్న వారందరినీ పరిశీలించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గణతంత్ర వేడుకల్లో అంబేడ్కర్ చిత్రపటాన్ని తప్పనిసరి చేయాలి



మాట్లాడుతున్న మన్నె శ్రీధర్

నాంపల్లి: గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటాన్ని తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయాలని యాక్షన్ కమిటీ, జైభీమ్ సేన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. రాజ్యాంగం అమలై 76 ఏళ్లు పూర్తయినా అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చలేకపోతున్నారని యాక్షన్ కమిటీ మాల చైర్మన్ మన్నె శ్రీధర్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు పి.బల్వంత్ రావు, అంబేడ్కర్ సేన కల్యాణ్ పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీలో గురువారం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.గంగాధర్, యూనివర్సిటీ బోధనేతర సంఘం అధ్యక్షుడు కె.మహిపాల్‌రెడ్డి, టీజీఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణయాదవ్ నూతన డైరీని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర మరువలేనిదని డైరీని అందజేసిన వారిని అభినందించారు.

సర్వీస్ ప్రొవైడర్ల సమస్యల పరిష్కారానికి కృషి



మల్లేష్, చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న సయ్యద్ ఉమర్, కేడీ ధినేష్

అబిడ్స్: సర్వీస్ ప్రొవైడర్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, వైస్ చైర్మన్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన వారిని సర్వీస్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షుడు సయ్యద్ ఉమర్, ప్రధాన కార్యదర్శి కేడి ధినేష్, ఉపాధ్యక్షులు ఖదీర్ అలీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తమ దృష్టికి ప్రొవైడర్ల సమస్యలు తీసుకువస్తే వెంటనే పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమల్‌ఖాన్, సయ్యద్ ముక్తార్ పాల్గొన్నారు.

నిజాం కళాశాలలో యాంటీ డ్రగ్ ర్యాలీ



గన్‌ఫౌండ్రీ: సామాజిక రుగ్మతలతో పాటు దురలవాట్లను నిర్మూలించడానికి యువతలో అవగాహన కల్పించాలని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ఏవి.రాజశేఖర్ అన్నారు. గురువారం నిజాం కళాశాలలో జాతీయ సేవా పథకం, కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు యాంటీ డ్రగ్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆరోగ్యకర సమాజంతోనే భారతదేశానికి మంచి భవిష్యత్తు ఉందన్నారు. అనంతరం కళాశాల పరిసర ప్రాంతాల్లో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి, అకాడమిక్ కో ఆర్డినేటర్ ఎస్.రేణుకా తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లు గడుస్తున్నా..

ప్రారంభం కానీ మల్టీ లెవల్ పార్కింగ్, ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణాలు



పార్కింగ్, ఆర్టీసీ బస్టాండ్ కోసం ఖాళీగా ఉన్న స్థలం

- జీహెచ్ఎంసీ మల్టీ లెవెల్ పార్కింగ్ కోసం..2018లో బస్టాండ్ కూల్చివేత
- గత ప్రభుత్వ హయాంలో నిధుల మంజూరు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు, పర్యాటకులు

చార్మినార్: చార్మినార్‌లో జీహెచ్ఎంసీ మల్టీ లెవల్ పార్కింగ్‌తో పాటు ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణాలు కార్యరూపం దాల్చకపోవడంతో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మల్టీ లెవల్ పార్కింగ్ నిర్మాణానికి తగిన ప్రణాళికలు రూపొందించి నిధుల మంజూరు కూడా జరిగింది. గత ఎన్నికలకు ముందు హడావుడిగా హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాతబస్తీలో చేపట్టిన ప్రారంభోత్సవాలలో భాగంగా చార్మినార్ మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణాలకు కూడా శంకుస్థాపన చేశారు..కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం లోనైనా మల్టీ లెవల్ పార్కింగ్‌కు మోక్షం లభిస్తుందా..! అని ఎదురు చూసిన పాతబస్తీ ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. గతంలో ఇక్కడ కొనసాగిన ఆర్టీసీ బస్టాండ్ భవనాన్ని కూల్చివేసి 7 ఏళ్లు దాటినా..ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో పాతబస్తీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కింద ఆర్టీసీ బస్టాండ్..పైన జీహెచ్ఎంసీ మల్టీ లెవల్ పార్కింగ్..

కోఠిలో ఉన్నట్లు కింది భాగంలో ఆర్టీసీ బస్టాండ్..పైన మల్టీ లెవల్ పార్కింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏళ్ల తరబడి కొనసాగిన ఆర్టీసీ బస్టాండ్‌ను పునరుద్ధరించడానికి మాజీ మంత్రి కేటీఆర్ 2022 ఆగస్టులో జరిగిన శాసనసభలో తెలియజేయడంతో పాతబస్తీ ప్రయాణికులు అప్పట్లో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారినా కార్యాచరణ పూర్తి కావడం లేదు.

రెండు చోట్ల రూ.47.95 కోట్లతో..

చార్మినార్‌తో పాటు మోతీగల్లీలోని ఓల్డ్ పింఛన్ పేమెంట్ కార్యాలయం ఖాళీ స్థలంలో కూడా రూ.47.95 కోట్ల నిధులతో మల్టీ లెవల్ పార్కింగ్ నిర్మించనున్నట్లు అప్పటి మంత్రి కేటీఆర్ అసెంబ్లీలో వెల్లడించారు. కమర్షియల్ కాంప్లెక్స్ పద్ధతిలో సాధ్యమైనంత వెంటనే కార్యాచరణ చేపడతామని ఇచ్చిన హామీ కూడా నెరవేర లేదు. కాగితాలకే పరిమితమవుతున్న వీటి నిర్మాణ వ్యయం మాత్రం పెరుగుతోంది. ఏడేళ్ల క్రితం తొలగించిన చార్మినార్ ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో జీహెచ్ఎంసీ మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటుతో పాటు ఆర్టీసీ బస్టాండ్ కూడా అందుబాటులోకి తీసుకురావడానికి సిద్ధమైనట్లు అప్పటి ప్రభుత్వం తెలిపింది.

ఆర్టీసీ బస్టాండ్ తొలగింపు..

జీహెచ్ఎంసీ మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తామంటూ ఇక్కడి ఆర్టీసీ బస్టాండ్ పాత భవన సముదాయాన్ని 2018 జనవరి 24న కూల్చివేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ ఎలాంటి నిర్మాణం పనులు జరుగకపోవడంతో..ఖాళీ స్థలం ఏర్పడింది. అటు పార్కింగ్ నిర్మాణం జరుగక.. ఇటు బస్టాండ్ లేకపోవడంతో పాతబస్తీ ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్న బస్టాండ్‌లను తొలగించిన అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రయాణికులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ఢిల్లీ గణతంత్ర పరేడ్‌కు
సిటీ కాలేజీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

చార్మినార్: సిటీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం మరో ఘనతను సాధించింది. ఐదు క్రియాశీలక యూనిట్లతో ఎల్లప్పుడూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఉత్తమ ప్రతిభను కనబరుస్తూ వస్తోంది. ఎన్ఎస్ఎస్ వలంటీర్ల కృషి వల్ల వారు ప్రతి ఏడాది వివిధ రాష్ట్రాల్లో నిర్వహించే ప్రఖ్యాత జాతీయ సమైక్యతా శిబిరాల్లో పాల్గొనడమే కాక, తమ ప్రతిభకు ఉత్తమ వలంటీర్ల బహుమతులు కూడా అందుకుంటున్నారు. ఈ ఏడాది కాలేజీ నుంచి నలుగురు విద్యార్థులు వివిధ జాతీయ సమైక్యతా శిబిరాలకు ఎంపికై పాల్గొన్నారు. ఇప్పుడు మరొక అరుదైన అవకాశాన్ని సాధించారు. బీకాం విద్యార్థి వినయ్, బీఏ విద్యార్థిని సుస్మిత న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న ప్రీ-రిపబ్లిక్ డే క్యాంప్ కోసం ఎంపికయ్యారు. 30 రోజుల శిక్షణా కార్యక్రమం అనంతరం జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎర్రకోట వద్ద జరిగే పరేడ్‌లో పాల్గొనడానికి సిద్ధమవుతున్నారు. ఈనెల 27న ప్రధాని మోదీతో భేటీ అవడమే కాక, లంచ్‌లో కూడా పాల్గొనబోతున్నారు. దేశ వ్యాప్తంగా లక్షమందికి పైగా వలంటీర్ల నుంచి ఎంపికైన వారిలో తమ కాలేజీ విద్యార్థులుండటం సిటీ కాలేజీ విద్యార్థుల నిబద్ధతకు, అద్భుత ప్రతిభకు సాక్ష్యంగా నిలుస్తుందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.బాల భాస్కర్ అన్నారు. విద్యార్థి వలంటీర్లను తీర్చిదిద్దటంలో విశేష కృషి చేస్తున్న ఎన్ఎస్ఎస్ యూనిట్ల సమన్వయకర్త డా.డి.నాగరాజు, యూనిట్ ఆఫీసర్లను అభినందించారు.

ముగిసిన స్వామి వివేకానంద జయంతి వేడుకలు



నాంపల్లి: ప్రపంచమంతా భారతదేశం వైపు చూసేలా చేసిన మహోన్నతమైన వ్యక్తి స్వామి వివేకానంద అని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య ఎం.కుమార్ అన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి ముగింపు వేడుకలు జరిగాయి. ఈ వేడుకలను గురువారం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య ఎం.కుమార్ ప్రసంగించారు. జీవితంలో ఏదైనా సాధించాలంటే సాధ్యపడేది యవ్వనంలోనే అన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీఎస్.నారాయణ మాట్లాడుతూ..వివేకానంద తన ప్రసంగాల ద్వారా ప్రపంచ దేశాల్లో భారతదేశానికి మంచి గుర్తింపు, గౌరవం తెచ్చిన గొప్ప వ్యక్తి అన్నారు. భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి డాక్టర్ ఎస్.బాలాచారి, జాతీయ పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి మండలి సలహాదారు లయన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు రాజ్ నారాయణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి



బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్

యాకుత్‌పురా: అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. రెయిన్‌బజార్ మహ్మద్ వసీవుద్దీన్, పలువురు అధికారులతో కలిసి గురువారం ఆయన యాకుత్‌పురా ఎస్ఆర్టీ కాలనీలో ఏర్పాటు చేసిన ఓపెన్ ఎయిర్ జిమ్‌ను ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రాంతాల్లో కొనసాగుతున్న నాలా విస్తరణ, డ్రైనేజీ, తాగునీటి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో మరిన్నీ ఓపెన్ జిమ్‌లు, పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

యువతి అదృశ్యం



పర్వీన్ బేగం

గౌలిపురా: సోదరిని స్కూల్‌లో వదిలేయడానికి వెళ్లిన ఓ యువతి కనిపించకుండా పోయిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై వి.నరేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టా సల్మాన్ మసీదు ప్రాంతానికి చెందిన మహ్మద్ జానీ రెండో కూతురు పర్వీన్ బేగం (19) ఈ నెల 22న మధ్యాహ్నం 3:30 గంటలకు తన సోదరి సాదియా బేగంను స్కూల్‌లో డ్రాప్ చేయడానికి వెళ్లి ఇంటికి తిరిగి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. తండ్రి మహ్మద్ జానీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బస్తీల్లో ఫాగింగ్ నిర్వహించాలి

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. జీహెచ్ఎంసీ సిబ్బంది చెత్తాచెదారాలను ఎప్పటిప్పుడు తీయకపోవడంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రాంతాలన్నీ అపరిశుభ్రంగా మారాయి. దీంతో తాము డెంగీ, మలేరియా ఇతర వ్యాధులకు గురి కావాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బస్తీల్లో వారంలో రెండుసార్లు ఫాగింగ్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న విశ్వబ్రాహ్మ, విశ్వకర్మ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ మాట్లాడారు. తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్‌ను తెలంగాణ జాతిపితగా ప్రకటించాలన్నారు. కమ్మరి వడ్రంగి, స్వర్ణకార ఇత్తడి శిలా శిల్పి సంప్రదాయ చేతివృత్తిదారులకు పెన్షన్ స్కీమ్ ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వృత్తి కళాకారుల కోటా కింద నామినేటెడ్ పదవులు ఇవ్వాలని, స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యతను కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రాగిఫణి రవీంద్రచారి, ఎర్రోజు వేణుగోపాల్, అద్దంకి నాగేశ్వర్‌రావు, బైరోజు రవీంద్రచారి పాల్గొన్నారు.

పదవీ విరమణ వయసు పెంచే ఆలోచన మానుకోవాలి

గౌలిపురా: పదవీ విరమణ వయసు పెంచే ఆలోచన మానుకోవాలని అభ్యుదయ రచయితల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సూర్య ప్రకాశ్, గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ అన్నారు. యువతకు ఉద్యోగాలు ఇచ్చేది పోయి ఉద్యోగం చేస్తున్నా పదవీ విరమణ వయస్సు వచ్చిన వారికి ఇంకా విరమణ వయసు పెంచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇరువురిని మోసం చేసినట్లు అవుతుందన్నారు. 58 ఏళ్లు విరమణ అయిన వాళ్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడానికి రాష్ట్ర ఖజానాలో పైసలు లేకపోవడంతో కేసీఆర్ ఈ విరమణ వయస్సు పెంచి కాంగ్రెస్ పార్టీ వారసత్వ సంపదగా చూపించి పోయాడన్నారు. నిరుద్యోగ యువత పొట్టకొట్టే నిర్ణయాన్ని ఏ ఉద్యోగ సంఘాలు, రాజకీయ పార్టీలు, నాయకులు కోరలేదన్నారు. ఇలాంటి పనికి మాలిన ఆలోచన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ నర్సింహా నాయక్

సంతోష్‌నగర్: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల బారి నుంచి కాపాడుకోవాలని సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఇ.నర్సింహా నాయక్ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో చంపాపేట్ రోడ్డు ఐ.ఎస్.సదన్ జంక్షన్‌లో వాహనదారులు, ఆటో డ్రైవర్లు, ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్లు పెట్టుకోకుండా వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరుగుతున్నాయన్నారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి



సిటీ కళాశాల ఆధ్వర్యంలో..



నివాళులర్పిస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్

చార్మినార్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సిటీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రొఫెసర్ డాక్టర్ శంకర్ నాయక్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు ఏబీవీపీ నాయకులు చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రొఫెసర్లు తిరుపతి, నాగరాజు, రామ్ కుమార్ రవీంద్రబాబు, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివశంకర్, చార్మినార్ నగర కార్యదర్శి రవితేజ, కళాశాల సెక్రటరీ అక్షయ్, హరికృష్ణ పాల్గొన్నారు.


అబిడ్స్‌లో..

అఫ్జల్‌గంజ్: సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు అబిడ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఏఐసీసీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్, మహ్మద్ రహీం, మహ్మద్ జమీల్, శ్రీనాథ్, విశ్వేశ్వర్‌రావు, నరహరి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏక్తా జనశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

యాకుత్‌పురా: సుభాష్ చంద్రబోస్ జయంతిని ఏక్తా జనశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దారుషిఫాలో ఆయన చిత్రా పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు రాజేష్‌యాదవ్, సభ్యులు ఐలేష్, లక్ష్మయ్య, రామలక్ష్మి, సుమలత, శ్రీవాణి పాల్గొన్నారు.

ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ మీట్ పర్యవేక్షణ



అబిడ్స్: ఇంటర్ కాలేజ్ గర్ల్స్ స్పోర్ట్స్ మీట్‌ను కన్వీనర్ మంజిత్ రెడ్డి జాయింట్ కన్వీనర్ అనిల్ మిశ్రా పర్యవేక్షించారు. గురువారం సరోజినీ నాయుడు వనిత ఫార్మసీ కళాశాలలో ఈనెల 24వ తేదీ నిర్వహించే ఇంటర్ కాలేజ్ గర్ల్స్ స్పోర్ట్స్ మీట్ ఏర్పాట్లను వారు పర్యవేక్షించి ప్రసంగించారు. శుక్రవారం విద్యార్థినుల కోసం ఈ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. విద్యార్థినులకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు.

భక్తిశ్రద్ధలతో పాదుక ప్రతిష్ఠాపనోత్సవం

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా మేకలబండ నల్ల పోచమ్మ ఆలయంలో అమ్మవారి పాదుక ప్రతిష్ఠాపనోత్సవం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు పొన్న వెంకటరమణ ఆధ్వర్యంలో జగద్గురువులు ఆది శంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠాధీశ్వరులు విద్యారణ్య భారతి కరములచే ఈ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు రాజేష్ ఆచార్యుల పర్యవేక్షణలో గణపతి పూజ, మండపారాధన, వాస్తు పూజ, నవగ్రహ, మాతృక, యోగిని వాస్తు క్షేత్రపాలక సర్వతో భద్ర మండల దేవతారాధన, హవనం తదితర పూజా కార్యక్రమాలు కొనసాగాయి.



హోమం జరిపిస్తున్న విద్యారణ్య భారతి స్వామి

షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధికి కృషి



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఫరాజ్, సత్యనారాయణ తదితరులు

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ మహ్మద్ రాషేద్ ఫరాజుద్దీన్ అన్నారు. గురువారం ఆయన షేక్‌పేట్‌లో రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలోని అన్ని బస్తీలు, కాలనీల్లో వీడీసీసీ రోడ్లు వేయించడం జరిగిందని అన్నారు. అదే విధంగా ఎగువ ప్రాంతాల్లో ఉన్న ఇళ్లకు నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తున్నానన్నారు. బుల్కాపూర్ నాలా కారణంగా దోమలు వృద్ధి చెందకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, ఏఈ మోహన్‌రావు, బాలరాజ్, ముఖేష్, లక్ష్మణ్, చంద్రకుమార్ తదితరులున్నారు.

జీఎన్ఐటీఎస్‌లో నెక్సోరా-2025 టెక్ ఫెస్టివల్



నెక్సోరాలో డ్రోన్ ప్రదర్శనను తిలకిస్తున్న అధ్యాపక బృందం

గోల్కొండ: షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నెక్సోరా-2025 టెక్ ఫెస్టివల్ ఆరోహి గురువారం ప్రారంభమైంది. కళాశాలకు చెందిన వివిధ విభాగాల వారు తమ తమ సాంకేతిక ప్రాజెక్టులను ప్రదర్శించి అధ్యాపక బృందంచే శభాష్ అనిపించుకున్నారు. కార్యక్రమాన్ని జీఎన్ఐటీఎస్ చైర్మన్ జి.రాఘవరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రెండు దశాబ్దాలకు పైగా సాంకేతిక విద్యా బోధన రంగంలో ఎదురు లేకుండా ముందుకు సాగుతున్నామన్నారు. తమ వద్ద వివిధ కోర్సులను పూర్తి చేసిన వారు నేడు దేశంలోని ప్రముఖ కంపెనీల్లో పని చేస్తున్నారని ఆయన తెలిపారు. నెక్సోరా టెక్ ఫెస్టివల్ సందర్భంగా పేపర్ ప్రజెంటేషన్స్, రోబోటిక్ షో, డ్రోన్ షో, ఎలక్ట్రికల్ వెహికిల్ షోలను నిర్వహించి విద్యార్థినులు తమ ప్రతిభను చాటుకున్నారన్నారు. టెక్ రెస్, టెక్ ట్రివియా, టెక్ టంకా లాంటి పోటీలు నిర్వహించి విద్యార్థి బృందాలను ప్రోత్సహించామన్నారు. ఈ కార్యక్రమంలో జీఎన్ఐటీఎస్ వైస్ చైర్ పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖను పూర్తిగా ప్రక్షాళన చేయాలి




సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖను పూర్తిగా ప్రక్షాళన చేయాలని అఖిలభారత యువజన సమైఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో గురువారం కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో సమాచారం అందుకున్న సుల్తాన్‌బజార్ పోలీసులు ఏఐవైఎఫ్ నాయకులను అరెస్టు చేసి సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేస్తున్న ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇటీవల కాలంలో కిడ్నీ అక్రమ మార్పిడీలు, బ్లడ్ అక్రమ దందాలు, నకిలీ డాక్టర్ల సేవలు, ప్రైవేట్ డయగ్నోస్టిక్ సెంటర్ల విచ్చలవిడి దోపిడీలు తారాస్థాయికి చేరాయని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఉపాధ్యక్షుడు సత్యప్రసాద్, శ్రీమాన్, షేక్ మహ్మద్, శివకుమార్, మాజీద్ అలీఖాన్, శేఖర్, వీరేష్, భాను, సంజయ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ కార్యాలయంలో ముష్టియుద్ధం

కొట్టుకున్న ఏఈ, వినియోగదారుడు

లంగర్‌హౌస్: మీటర్ పని చేయట్లేదని ఫిర్యాదు చేస్తే, ట్యాంపరింగ్ చేశారంటూ తిరిగి తమపైనే కేసు నమోదు చేస్తారా అంటూ విద్యుత్‌శాఖ ఏఈని ఓ వ్యక్తి నిలదీశాడు. మాటామాటా పెరిగి అధికారి, వినియోగదారుడు ముష్టియుద్ధానికి దిగారు. ఈ ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన మేరకు.. లంగర్‌హౌస్‌లో నివాసముండే శ్రవణ్ ఇంట్లో కొద్ది నెలలుగా విద్యుత్ బిల్లు ఎక్కువగా వస్తుంది. అయితే అధికారుల సూచన మేరకు గత నవంబర్‌లో రూ.1400 డీడీ శ్రవణ్ చెల్లించి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ మీటర్‌ను టెస్టింగ్‌కు పంపించారు. అయితే మీటర్ టెస్టింగ్‌లో ట్యాంపరింగ్‌కు పాల్పడినట్లు అధికారులు తేల్చారు. శ్రవణ్‌కు నోటీసులు పంపినా పట్టించుకోవట్లేదని రూ.36వేల జరిమానా విధించడంతో పాటు విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న శ్రవణ్ గురువారం ఉదయం ఏఈ కార్యాలయానికి వెళ్లాడు. ఏఈ అఖిలేష్‌తో మాటామాటా పెరిగి ఇద్దరూ కొట్టుకున్నారు. ఈ ఘటనపై ఏఈ ఫిర్యాదు మేరకు పోలీసులు శ్రవణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయం



జగదీశ్వర్, ముజీబ్ హుస్సేన్‌ను సత్కరిస్తున్న కేఆర్.రాజ్‌కుమార్, భాస్కర్

అబిడ్స్: ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయమని టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీ పేర్కొన్నారు. గురువారం విద్యాశాఖలో పనిచేస్తూ పదోన్నతులు పొందిన ఎం.భాస్కర్, రాజేశ్వర్ ప్రసాద్, శశికాంత్ రెడ్డి విద్యాశాఖ టీఎన్జీఓస్ యూనియన్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేనిలను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్వర్, ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకట్, సత్యనారాయణ, లక్ష్మణ్, కొండల్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సంతోష్, శ్రీనివాస్, ప్రియా, ఫిరోజ్, అహ్మద్, ఠాకూర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.